ప్రభుత్వ స్థలాల్లో పేదలకు పట్టాలివ్వాలి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన పీసీసీ ఎస్సీసెల్‌ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌

శంషాబాద్‌ : రాజేంద్రనగర్‌ నియోకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో పేదలకు భూములిచ్చి పట్టాలివ్వాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పీసీసీ ఎస్సీసెల్‌ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌, ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ కోరారు. గురువారం మంత్రి కార్యాలయంలో వారిని కలిసి సత్కరించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున ఉన్నాయన్నారు. భూముల సమస్యను పరిష్కరించి పేదలకు అందజేయాలన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి బైరాగిగూడ, గంధంగూడ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌ ప్రియాంక ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. నార్సింగి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్‌, ఎలక్ట్రికల్‌ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మూసీనది పరీవాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. మూసీ రివర్‌ బెడ్‌, బఫర్‌ జోన్‌లకు సంబంధించి క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి, రివర్‌ బెడ్‌ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సురేష్‌, విక్రంరెడ్డి, సర్వేయర్‌ జగదీశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్‌ సెంటర్‌ వద్ద ఘర్షణ... ఇద్దరి రిమాండ్‌

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ పీడీపీ చౌరస్తా రాయల్‌ జ్యూస్‌ సెంటర్‌ వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. రాయల్‌ జ్యూస్‌ సెంటర్‌ వద్ద బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జ్యూస్‌ తాగేందుకు వచ్చిన ఇద్దరు కస్టమర్ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవను ఆపేందుకు యజమాని బాబా ప్రయత్నించగా అతనిపై అక్బర్‌ (25), మహ్మద్‌ సర్వర్‌ (25) దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో జ్యూస్‌ సెంటర్‌లోని సామాగ్రిని సైతం ధ్వంసం చేశారు. నిందితులు తన పై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



మణికొండ: ప్రతి రోజు ప్రజల క్షేమానికి కృషి చేసే మున్సిపల్‌ కార్మికులు తరచూ పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ అన్నారు. గురువారం మున్సిపల్‌ కార్యాలయంలో కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి నెల ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకుని డాక్టర్ల సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ శ్రావణ్‌, శానిటేషన్‌ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్‌ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్‌ కార్పొరేటర్‌ పుష్పశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 16వ డివిజన్‌లోని రఘురాంనగర్‌ కాలనీలో కమ్యూనిటీహాల్‌ నిర్మాణానికి కాలనీ వాసులతో కలిసి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి సుమారు అంచనా రూ. 40 లక్షలకు ఆమోదం పొందడం జరిగిందన్నారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి నాణ్యత లోపాలు రాకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ప్రథమ లక్ష్యం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పరిశుభ్రతను పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడమే ప్రథమ లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌ అన్నారు. గురువారం 'స్వచ్ఛతా హీ సేవ ' కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఐసీ కాలనీ పార్కులో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం అలకాపూర్‌ టౌన్‌ షిప్‌ రోడ్డు నెంబర్‌ 30లో మాస్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్‌ ఇంచార్జి సంపత్‌, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాలకు నిలయంగా మ్యాన్‌హోల్‌

- కనిపించని ప్రమాద సూచికలు
- మ్యాన్‌హోల్‌లో పడి చిన్నారులకు స్వల్ప గాయాలు
- స్థానికులు స్పందించడంతో తప్పిన ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మ్యాన్‌ హోల్‌



మ్యాన్‌హోల్‌లో పడిన చిన్నారులు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌ పరిధిలోని మధుబన్‌ కాలనీ ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్‌ తెరిచి ఉండడంతో గురువారం అటు నుంచి వస్తున్న చిన్నారులు అందులో పడ్డారు. అది గమనించిన స్థానికులు చిన్నారులను వెంటనే పైకి లేపారు. దీంతో ప్రమాదం తప్పిందని, గత రెండు రోజులుగా రహదారిపై మురుగు నీరు పారుతూనే ఉందని స్థానికులు తెలిపారు. ఇలాంటి ఓపెన్‌ మ్యాన్‌హోల్‌ల పై కాషన్‌ బోర్డులు పెట్టాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు కాలనీలో ఉన్న ఓపెన్‌ మ్యాన్‌హోల్‌లను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

డ్రైనేజీ మూతలు పగిలిపోయాయి

రోడ్లపై భారీ వాహనాలు వెళ్తుండడంతో డ్రైనేజీ పై ఉన్న మూతలు పగిలిపోయి అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వచ్చినప్పుడు ఆ గుంతలు నిండి అక్కడ మ్యాన్‌హోల్‌ కనబడక అటు నుంచి వెళ్లేవారు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌లను గుర్తించి అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలి.

– రమేష్‌– మధుబన్‌ కాలనీ నివాసి



మ్యాన్‌హోల్‌ను మూసివేసిన స్థానికులు

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయిస్తా

మధుబన్‌ కాలనీలో ఉన్న ఓపెన్‌ మ్యాన్‌హోల్‌లో పడిన చిన్నారులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అలాంటి ఓపెన్‌ మ్యాన్‌హోల్‌లకు వెంటనే కంచెను ఏర్పాటు చేయించి మరమ్మతులు చేయిస్తాను. డ్రైనేజీ సమస్యలు ఏదైన ఉంటే ప్రజలు జలమండలి అధికారుల దృష్టికి తీసుకురావాలి.

–సయ్యద్‌ సాజీద్‌–
కాటేదాన్‌ జలమండలి మేనేజర్‌

ఉద్రిక్తతకు దారి తీసిన సర్వే మార్కింగ్‌





మార్కింగ్‌ చేస్తున్న అధికారులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

రాజేంద్రనగర్‌/అత్తాపూర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతంలో గురువారం అధికారులు చేపట్టిన సర్వే మార్కింగ్‌ ఉద్రిక్తతలకు దారి తీసింది. రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఆర్డీఓ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే చేపట్టి గుర్తించిన ఇళ్లకు మార్కింగ్‌లను వేశారు. సంబంధిత ఇంటి యజమానులతో మాట్లాడే ప్రయత్నంలో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్‌ పోలీసుల బందోబస్తు మధ్య అత్తాపూర్‌ మూసి పరీవాహక ప్రాంతంలో అధికారులు సర్వే చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సర్వే చేపట్టి నిర్మాణాలకు మార్కింగ్‌ వేశారు. సంబంధిత యజమానులను పూర్తి దస్తావేజులతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

మార్కింగ్‌లతో వాగ్వాదం...

గతంలో మూసిరివర్‌ ఫ్రంట్‌ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఆ సమయంలో మూసి పరీవాహక ప్రాంతంలో నిర్మించిన ఇళ్లకు ఎలాంటి మార్కింగ్‌ ఇవ్వలేదు. ప్రస్తుతం నిర్మాణాలు తొలగించే వాటికి ఆర్‌బీఎక్స్‌ ముద్రలు వేశారు. ఈ ముద్రలు వేయడాన్ని కొందరు అడ్డుకున్నారు. భరత్‌నగర్‌, కేసీఆర్‌నగర్‌, ఆటోనగర్‌లలో అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు, అధికారులు వారిని సముదాయించారు. అనంతరం వాటికి మార్కింగ్‌ చేసి అధికారులు అక్కడి నుంచి తరలివెళ్లారు.

లబోదిబోమంటున్న ఇంటి యజమానులు...

తాము పైసా పైసా కూడబెట్టి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు అధికారులు కూలుస్తామనడం ఎంతవరకు సమంజసమని స్థానిక ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. స్థలాన్ని కొనుగోలు చేసిన సమయంలో అధికారులు రిజిస్ట్రేషన్‌ ఖర్చులు తీసుకొని రిజిస్ట్రేషన్‌ చేశారన్నారు. జీహెచ్‌ఎంసీ అన్ని దస్తావేజులు పరిశీలించి అనుమతులు ఇచ్చారని, పదేళ్లుగా తాము పన్నులు చెల్లిస్తున్నామన్నారు. ఇప్పుడు అక్రమ నిర్మాణాలని కూల్చివేయడం ఏంటంటూ ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్‌ చేసిన అధికారి, అనుమతులు ఇచ్చిన అధికారుల ఇళ్లను కూల్చివేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలైన తమను రోడ్డుపాలు చేయడం సరైంది కాదన్నారు.





సర్వే చేపడుతున్న అధికారులు

నేడు 'నిథమ్‌'లో ప్రపంచ పర్యాటక దినోత్సవం

పాల్గొననున్న సీఎం, పర్యాటకశాఖ మంత్రి

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌) ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిథమ్‌ పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ వాణి ప్రసాద్‌ అధ్యక్షత వహిస్తారు. నిథమ్‌ ప్రాంగణంలో యోగా ప్రదర్శన, ఫుడ్‌ ఫెస్టివల్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఆర్ట్స్‌ అండ్‌ క్రాఫ్ట్స్‌ హ్యాండ్లూమ్‌ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

ట్రిపుల్‌ఐటీలో వాటర్‌ నెట్‌వర్క్‌ డిజిటల్‌ ట్విన్‌ ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌ ప్రాంగణంలో స్మార్ట్‌ సిటీ లివింగ్‌ ల్యాబ్‌, జెడ్‌ఎఫ్‌ టెక్నాలజీస్‌ సంస్థ సహకారంతో వాటర్‌ యుటిలిటీ నెట్‌వర్క్‌ కోసం వినూత్న డిజిటల్‌ ట్విన్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించారు. 5 నెలల క్రితం సీఎస్‌ఆర్‌ కింద నిర్ణయించిన మేరకు ప్రస్తుతం స్మార్ట్‌ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ మేనేజ్‌మెంట్‌లో గణనీయమైన పురోగతి సాధించడంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ నోడ్‌లు (నీటి నాణ్యత, నీటి ప్రవాహం, నీటి స్థాయి, మోటారు నియంత్రణ) అమలు చేయబడ్డాయి. ఈ సందర్భంగా చీఫ్‌ టెక్నాలజీ ఆర్కిటెక్ట్‌ అనురాధ మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో హైదరాబాద్‌ మెట్రో పాలిటన్‌ వాటర్‌ సప్లై అండ్‌ సీవరేజ్‌ బోర్డు(హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ)తో సెంటర్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌ ఫర్‌ వాటర్‌(వాటర్‌ సీఓఈ) ఏర్పాటు కోసం ఒక ఒప్పందం కుదుర్చుకోవడంతో డిజిటల్‌ ట్విన్‌ను నిర్మించాలనే ఆలోచన వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ దీపక్‌ గంగాధరన్‌, డాక్టర్‌ కార్తీక్‌ వైద్యనాథన్‌ పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్‌ టీకాలు



కుక్కలకు యాంటీ రేబిస్‌ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో 'స్వచ్ఛతా హీ సేవా' 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వభావ్‌ స్వచ్ఛత, సంస్కార్‌ స్వచ్ఛత అనే థీమ్‌తో గురువారం బ్లూ క్రాస్‌ ఆఫ్‌ హైదరాబాద్‌, మిషన్‌ రేబిస్‌ వారిచే రేబిస్‌ ఫ్రీ తెలంగాణ అనే నినాదంతో దర్గా జీషాన్‌ రెస్టారెంట్‌ ఎదురుగా ఉచిత యాంటీ రేబిస్‌ టీకాలను వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు వేయించారు. దాదాపు 311 కుక్కలకు రేబిస్‌ వ్యాక్సిన్‌ వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర పాల్గొని మాట్లాడుతూ.. మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని మొత్తం 4,400 కుక్కలు ఉన్నాయని, అందులో 3,290 కుక్కలకు యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌(ఏబీసీ) చేయించామన్నారు. 74.77 శాతం బ్లూ క్రాస్‌ హైదరాబాద్‌ వారి సహకారంతో పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లూ క్రాస్‌ హైదరాబాద్‌ హెల్త్‌ డైరెక్టర్‌ కుమారి, మిషన్‌ రేబిస్‌ డాక్టర్‌ వైభవ్‌, ప్రవీణ్‌, వాలంటీర్లు శ్రీనివాస్‌, భాను, కార్పొరేటర్‌ అస్లాంబిన్‌ అబ్దుల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, శానిటరీ జవాన్లు రాము, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



టీపీసీసీ అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మణికొండ: రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ అభ్యర్థులే అన్ని సీట్లలో గెలిచేలా పార్టీని మరింత బలోపేతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌ సూచించారు. మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో గురువారం నార్సింగిలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు ఆయనను కలిసి పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని, దాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ కొరకు నిర్విరామంగా పనిచేసిన వారికే రాబోయే రోజుల్లో నామినేటెడ్‌ పదవులను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కిరణ్‌ కుమార్‌, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కో–ఆప్షన్‌ సభ్యుడు తాజుద్దీన్‌, సీనియర్‌ నాయకులు నరేష్‌, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌ చైర్మన్‌ విజయ్‌బాబు

మణికొండ: మున్సిపాలిటీలలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు పని ఒత్తిడి తగ్గించుకుని ఆహ్లాదంగా పనిచేసుకునే వాతావరణం ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని నార్సింగి మున్సిపాలిటీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌బాబు అన్నారు. గురువారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్‌, రెవెన్యూ, ఇంజనీరింగ్‌ విభాగాల సిబ్బందికి 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. అనుదినం ప్రజల సేవలో గడిపే సిబ్బంది, అధికారులు అప్పుడప్పుడు ఇలాంటి ఆట విడుపు కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్‌, ఇంజనీరింగ్‌ టీములు క్రికెట్‌లో తలపడగా అందులో శానిటేషన్‌ టీమ్‌ గెలుపొందింది. అనంతరం ఇంజనీరింగ్‌ టీమ్‌ రెవెన్యూ టీమ్‌తో తలపడి రన్నరప్‌గా నిలవగా, విజేతగా రెవెన్యూ టీమ్‌ నిలిచింది. వారిని వైస్‌ చైర్మన్‌ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మైలారం శ్రీనివాస్‌, డీఈ నరసింహరాజు, ఏఈ శ్రీనివాస్‌, అకౌంటెంట్‌ కృష్ణ, ఆర్‌ఐ, శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నెయ్యి కంపెనీపై దాడులు



అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కంపెనీలో బట్టర్‌ డబ్బాలు

మైలార్‌దేవ్‌పల్లి: అనుమతులు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో వెన్న తయారీ కంపెనీపై ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌ సర్కిల్‌ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కాటేదాన్‌ పారిశ్రామిక వాడలో గత కొన్ని రోజులుగా శ్రవణ్‌ అనే వ్యక్తి తెలంగాణ ఫుడ్స్‌ పేరుతో వెన్నను తయారు చేస్తున్నాడు. అపరిశుభ్ర వాతావరణంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా రీప్యాకింగ్‌ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌వోటీ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు గురువారం కంపెనీపై పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. నిర్వాహకుడి నుంచి 280లీటర్ల బట్టర్‌, 21బ్యాగులు మిల్క్‌ పౌడర్‌, 25కేజీల మైదాపిండిని సీజ్‌ చేసి, వాటిని ఫుడ్‌ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న నెయ్యి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నిర్వాహకుడు శ్రవణ్‌ను పోలీసులకు అప్పగించారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌, తదితరులు



బుద్వేల్‌ ఫిల్టర్‌ బెడ్స్‌ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

అత్తాపూర్‌: వీరనారి చాకలి ఐలమ్మను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రాజేంద్రనగర్‌ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. అత్తాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పెద్దతాళ్ల కుంట చెరువు వద్ద హైదర్‌గూడ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ హాజరై ఐలమ్మ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. మైలార్‌దేవ్‌పల్లిలో, రాజేంద్రనగర్‌ డివిజన్‌ పరిధిలోని రజక సంఘం సభ్యులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌ జనరల్‌ సెక్రటరీ పెండ్యాల శ్రీధర్‌, పెండ్యాల సాయి కుమార్‌, జ్ఞానేశ్వర్‌, లక్ష్మిగూడ రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏజీవర్సిటీలో..

శ్రీ కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలంగాణ పోలీస్‌ అకాడమీలో..

బండ్లగూడ తెలంగాణ పోలీస్‌ అకాడమీలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకాడమీ సెమినార్‌ హాల్‌లో ఐలమ్మ చిత్రపటానికి ఉన్నతాధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ వేడుకలకు జాయింట్‌ డైరెక్టర్‌ మురళీధర్‌ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ డైరెక్టర్‌ మురళీధర్‌, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, సునీతమోహన్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్లు, డీఎస్పీలు, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బుద్వేల్‌ రజక సంఘం భవనంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న రజక సంఘం సభ్యులు



తెలంగాణ పోలీస్‌ అకాడమీలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు హర్షణీయం



నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్‌, వీర్లపల్లి శంకర్‌

శంషాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయానికి సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టడం హర్షణీయమని రాజేంద్రనగర్‌, షాద్‌నగర్‌ ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్‌, వీర్లపల్లి శంకర్‌ అన్నారు. పట్టణంలోని ఊరచెరువు వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజకసంఘం నాయకుడు, కౌన్సిలర్‌ కుమార్‌ ఏర్పాటు చేసిన ఐలమ్మ 129వ జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ, వైస్‌చైర్మన్‌ బండిగోపాల్‌, మాజీ సర్పంచ్‌ గణేష్‌ గుప్తా, మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్‌, కౌన్సిలర్లు అజయ్‌, సంజయ్‌యాదవ్‌, ప్రవీణ్‌గౌడ్‌ నాయకులు, రజకసంఘం నేతలు, ఆయా పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఐలమ్మ జయంతి వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

